నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం
14 డిసెంబర్ 2025 పేజీలు : 08





## కార్పొరేషన్‌లో మారుతున్న
# రాజకీయ సమీకరణలు

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

నగర పాలక సంస్థలో మేయర్ స్రవంతిపై ఈనెల 18వ తేదీ అవిశ్వాసం ఉండడంతో అవిశ్వాస సమావేశానికి ముందే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు తెలుగు దేశం పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్పొరేటర్లను అధికార తెలుగు దేశం పార్టీకి చెందిన నాయకులు ఇప్పటికే తెలుగుదేశం పార్టీలో చేర్పించడం జరిగింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రూరల్ సంబంధించిన కార్పొరేటర్లు చేజారకుండా వారిని క్యాంపులో ఉంచిన విషయం తెలిసిందే. అదేవిధంగా నగర నియోజక వర్గానికి సంబంధించిన కార్పొరేటర్లు వైఎస్సార్సీపీలోకి వెళ్లకుండా మంత్రి నారాయణ తెలుగుదేశం పార్టీకి సంబంధించిన కొంత మంది నాయకులకు బాధ్యతలు అప్పగించడంతో వారిని కూడా తెలుగు దేశం పార్టీ నాయకులు క్యాంపులో ఉంచారు. శనివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో బలంగా ఉన్న 37 డివిజన్ కార్పొరేటర్, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మంత్రి పి.నారాయణ సమక్షంలో తెలుగు దేశం పార్టీలో చేరి అందర్నీ ఆశ్చర్యపరిచారు. అదేవిధంగా 42వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ కరీముల్లా, టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌తో కలిసి విజయవాడలో మంత్రి నారాయణ సమక్షంలో తెలుగు దేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈవిధంగా ఎవరు ఊహించని విధంగా నగరపాలక సంస్థలో

-మిగతా 2లో



- టీడీపీ వైపు మొగ్గు చూపుతున్న పలువురు కార్పొరేటర్లు
- కార్పొరేషన్‌లో పెరుగుతున్న టీడీపీ కార్పొరేటర్ల బలం

## జెడ్పీ బడ్జెట్
# ఏకగ్రీవ ఆమోదం

- కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు.. నెల్లూర్లులోనే ఉంచాలని సభ్యులు తీర్మానం
- యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచన
- ఆలస్యంగా ప్రారంభమైన జెడ్పీ సమావేశం
- సమావేశానికి హాజరు కాని పలువురు ప్రజాప్రతినిధులు



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

వార్షిక బడ్జెట్ అంచనాలకు, 2025-2026 సవరించిన బడ్జెట్ అంచనాలకు సభ్యులు ఏకగ్రీవంగా సమ్మతి తెలపడంతో ఆమోదించినట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. శనివారం ఉదయం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు,

-మిగతా 2లో

## విద్యార్థులచే
# వెట్టి చాకిరీ



02 పేజీలో



## పోర్టు కార్మికుల సంక్షేమం కోసం
# కృషి చేస్తున్నా..

**ఆల్ ఇండియా పోర్టు ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ చైర్మన్ షేక్ ఖలీఫా తుల్లా బాషా**

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పోర్టు కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నానని ఆల్ ఇండియా పోర్టు ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ చైర్మన్ షేక్ ఖలీఫా తుల్లా బాషా చెప్పారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు కార్మిక నాయకుల సమావేశం అనంతరం నెల్లూరు నగరంలోని ముస్లిం రాష్ట్ర నాయకులు సయ్యద్ సమీ నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టులో కార్మికులు పలు సమస్యలతో సతమతం అవుతునట్టు తన దృష్టికి వచ్చిందని, పోర్టు యాజమాన్యంతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. రాష్ట్రంలో ఉన్న పోర్టులను ఆధునికరణం చేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో నిధుల కేటాయింపులో మన రాష్ట్రానికి పెద్దపీట వేశారని కేంద్ర పోర్ట్, షిప్పింగ్, వాటర్వేస్ మంత్రులు సర్భానంద సోనావల్, సంటాను ఠాకూర్‌లు ఏపీ పోర్టులు అభివృద్ధితో పాటు ప్రధాన మౌలిక సదుపాయలను కలిపించడానికి కృషి చేస్తున్నారని, అందులో భాగంగా కాకినాడలో ఎలక్ట్రానిక్ షిప్ తయారీ కేంద్రాన్ని 600 కోట్లతో సన్ మెరియన్ కంపెనీకి మరో 200 కోట్లు కలిపి మొత్తం 800 కోట్లు ఇవ్వడంతో కాకినాడ పోర్టుకు మాహర్ధశ వచ్చిందన్నారు. ఈ తయారీ కేంద్రం వల్ల అనేక మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా సహకారం అందిస్తునందున పోర్టులన్ని ఆధునికరణ చెందుతాయన్నారు. వంద సంవత్సరాల నుండి ఉన్న పాత కార్మిక 29 చట్టాలను మారుస్తూ 4 కోడ్ కార్మిక చట్టంను సంఘటిత, అసంఘటిత కార్మికుల జీవన శైలి మారుస్తూ.. వారికి ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పిస్తూ

-మిగతా 2లో

# విద్యార్థులచే వెట్టి చాకిరీ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం నెహ్రూ నగర్‌లోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల తీరుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠాలు చెప్పాల్సిన గురువులు తమ బిడ్డల చేత వెట్టి చాకిరీ చేయిస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. శనివారం పాఠశాల వెనుక భాగంలో ఉన్న కంపచెట్లకు అనుకోకుండా మంటలు అంటుకున్నాయి. ఈ మంటలను ఆర్పేందుకు ఉపాధ్యాయులు స్వయంగా రంగంలోకి దిగకుండా, స్కూల్‌లో చదువుకుంటున్న చిన్నారి విద్యార్థులనే వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు లోపలే కూర్చుని ఆదేశాలు జారీ చేయగా, పిల్లలు మంటలు ఆర్పేందుకు బయలు దేరారు. కనీసం ఒక్క బకెట్ నీళ్లు కూడా పూర్తిగా మోయలేని చిన్నారి విద్యార్థులు ఇద్దరు ముగ్గురు కలిసి బకెట్లను పట్టుకొని నీళ్లు మోసి మంటలు ఆర్పుతున్న దృశ్యాలు చూపరులను కలచివేశాయి. పాఠశాలలో ఉంటూ, పిల్లల భద్రతకు బాధ్యత వహించాల్సిన ఉపాధ్యాయులు కనీసం ప్రమాదం గురించి తెలియని చిన్నారుల చేత ఈ విధంగా నీటి బకెట్లు మోయించి ప్రమాదకరమైన పని చేయించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ పిల్లలు చదువుకోవాల్సిన పాఠశాలలో ఈ విధంగా వెట్టి చాకిరీ ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై స్కూల్ ఉపాధ్యాయులు భారతీని వివరణ అడగగా స్కూల్ పక్కన మంటలు వస్తుంటే పిల్లల చేత ఆపేదానికి చేయించామన్నారు. చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అంటూ చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

## జెడ్పీ బడ్జెట్ ఏకగ్రీవ ఆమోదం



(మొదటి పేజీ తరువాయి)

సీఈవో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కావలి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు డివి కృష్ణారెడ్డి, నెలవల విజయశ్రీ, జడ్పీటీసీలు, ఎంపిపిలు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజాపరిషత్ ఆదాయ వ్యయాలను పద్దులవారీగా కలుపుకుని 2026-27 సంవత్సరపు బడ్జెట్ అంచనాలలో రూ.61,07,26,000లు ఆదాయంగా తీసుకుని, వ్యయంగా రూ.61,06,73,896లు చూపించి బడ్జెట్ అంచనాలు రూపొందించారు. రూ.52,104 మిగులు బడ్జెట్ అంచనాలను తయారు బచేశారు. వీటికి సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే 2025-26 సంవత్సరంలో సవరించిన అంచనాలలో రూ.76,45,62,703 లు ఆదాయంగా రూ.71,98,30,376లు వ్యయంగా చూపించారు. వీటికి సభ్యులు ఆమోదం తెలిపినట్లుగా జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. తొలుత సమావేశంలో వ్యవసాయం, జలవనరులు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఆర్‌అండ్‌బి శాఖలవారీగా సభలో చర్చించారు. ప్రధానంగా యూరియా సరఫరాను మెరుగుపరచాలని సభ్యులు కోరగా, రైతుల అవసరాల మేరకు ఈ ఏడాది యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎటువంటి ఇబ్బందులు లేవని, అడిగిన వెంటనే యూరియాను సరఫరా చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి సభ్యులకు వివరించారు. అలాగే నందవరం-నందిపాడు, మర్రిపాడు-గౌరవరం, కలువాయి మండలంలో రహదారులు, పలు ప్రధాన రహదారుల మరమ్మత్తులు, నూతన రోడ్లు మంజూరుపై సభ్యులు ప్రశ్నించారు. నూతనంగా మంజూరైన ఆరోగ్య కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన



అన్ని సమస్యలను ఆయా శాఖాల అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా యూరియా సరఫరా, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశం ప్రారం భానికి ముందు ఇటీవల మరణించిన దక్కిలి జడ్పీటిసీ కలివెల రాజేశ్వరమ్మ మృతికి సంతాపంగా సభ్యులందరూ మౌనం పాటించారు. కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించేలా సభ్యులు ప్రధానంగా చర్చించారు. తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ఎదురయ్యే సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. నెల్లూరు జిల్లాలోనే కొనసాగించే సభ్యుల ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేయగా, ప్రభుత్వానికి నివేదిక పంపుతామని జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ తెలిపారు. విజయదీపిక స్టడిమెటీరియల్ ఆవిష్కరణ విజయదీపిక స్టడీ మెటిరియల్‌ను జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించా రు. జిల్లాలోని 418 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 20,500 మంది విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించనున్నారు. పదో తరగతిలోని అన్ని పాఠ్యాంశాల సమగ్ర సమాచారంతో ఒకే బుక్‌లెట్‌గా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఈ విజయ దీపికను రూపొందించారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో మోహా న్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి, జలవనరులశాఖ ఎస్ఈ దేశ్‌నా యక్, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, డీజీపీ ఎస్ఈ సుబ్రహ్మణ్యే శ్వరరావు, ఆర్‌అండ్‌బి ఎస్ఈ ప్రసాదరావు, డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### కార్పొరేషన్‌లో మారుతున్న రాజకీయ సమీకరణలు



(మొదటి పేజీ తరువాయి)

రాజకీయం మలుపులు తిరుగుతుంది. వైయస్ఆర్సీపీకి తాము పక్కా విధేయులని.. చివరి వరకు వైసీపీలో ఉంటామని చెబుతున్న కొందరు కార్పొరేటర్ల సైతం ఒక్కసారిగా తెలుగుదేశం పార్టీలో చేరుతుండడంతో మిగతా సభ్యులకు అర్థం కాని విధంగా మారింది. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమయం దగ్గర పడుతున్న కొద్ది.. నగరపాలక సంస్థలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతుంది. నగర పాలక సంస్థలో మొత్తం 54 మంది కార్పొరేటర్లు ఉండవలసి ఉండగా, మాజీ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ రాజీనామాతో మేయర్‌తో సహా 52 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అయితే సంఖ్యాపరంగా తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు 42 మంది దాకా ఉన్నారు. వైయస్ఆర్సీపీకి 11 మంది కార్పొరేటర్ ఉన్నట్లు సమాచారం. మేయర్ ఒక్కరే తటస్థంగా ఉన్న విషయం తెలిసిందే. అవిశ్వాస తీర్మానం సమీపిస్తున్న కొద్ది నగరపాలక సంస్థలో నెల్లూరు నగరం, రూరల్ నుంచి కార్పొరేటర్లు ఎవరు ఏ పార్టీలో ఉంటున్నారో కొందరు తెలియని పరిస్థితిగా మారింది. ఎక్కువ మంది తమ డివిజన్లో అభివృద్ధి జరగాలంటే తాము తెలుగుదేశం పార్టీలో చేరక తప్పదు.. అంటూ ఆయా నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. సంఖ్యాపరంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర పాలక సంస్థలో బలహీనంగా మారిందిని పలువురు అంటున్నారు. కోటంరెడ్డి సోదరులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిష్టాత్మక తీసుకొని అడుగులు వేస్తున్నారు. మంత్రి నారాయణ కూడా నగరంలోని కార్పొరేటర్లు చేజారకుండా తెలుగుదేశం పార్టీ నాయకులకు బాధ్యతలు అప్పగించి ఉన్నారు. దీంతో నగరపాలక సంస్థలో రాజకీయం ఆసక్తిగా మారింది.

### ఎమ్మెల్యే చొరవతో తీరిన తాగునీటి కష్టాలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరు మండలం ఆలూరుపాడు గ్రామంలోని కుమ్మరుగంటలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న స్థానికులకు ఊరట లభించింది. గత కొన్ని రోజులుగా కుమ్మరుగంట ప్రాంతంలో తాగునీటి సరఫరాకు వినియోగించే మోటారు చెడిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై గ్రామస్థులు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని సంప్రదించగా.. ఆమె తక్షణమే స్పందించారు. కేవలం 24 గంటలలోపు చెడిపోయిన మోటారు స్థానంలో కొత్త మోటారును బిగించి, నీటి సరఫరాను పునరుద్ధరించడం జరిగింది. ప్రశాంతమ్మ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. 24 గంటల్లోనే నీటి సమస్య పరిష్కారం చేయడంతో స్థానిక నాయకులు, కుమ్మరుగంట ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### పోర్టు కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నా..

చట్టం తెస్తే కమ్యూనిస్టు కార్మిక సంఘాలు కొత్తగా వచ్చిన 4 కోడ్ చట్టం వల్ల తమ ఉనికి పోతుందన్న దురుద్దేశం కలిగి కొత్తగా కేంద్రం తెచ్చిన కొత్త చట్టం విషయంలో కార్మికులకు అన్యాయం జరుగుతుందని అబద్ధపు ప్రచారం చేయడం దురదృష్టం అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పోర్టులను సందర్శించి అక్కడి కార్మికుల సమస్యలు పరిష్కారంతోపాటు వారి సంక్షేమమే తన ధ్యేయంగా సహకారం అందిస్తామన్నారు. అనంతరం మత పెద్దలు, చైర్మన్‌ని సన్మానించారు.

# అడ్వంచర్‌క్యాంప్లోడ్‌లో ప్రతిభ చూపిన కార్తికేయ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** హిమాచలప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి అడ్వెంచర్ క్యాంప్లోడ్ (సాహసవిన్యాసాలు) కార్యక్రమంలో నెల్లూరు వెంకటేశ్వరపురంకు చెందిన బిటెక్ విద్యార్థి తలపల కార్తికేయ అత్యంత అద్భుత ప్రతిభ చూపి ప్రశంశాపత్రం అందుకున్నారు. ఆ విద్యార్థి హిమాచలప్రదేశ్‌లో కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రయాణఖర్చులకు బలిజసేవాఫౌండేషన్ వారు 10వేల రూపాయల ఆర్థికసాయమందించారు. 70మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో కార్తికేయ అక్కడ ప్రతిభచూపి ప్రధముడుగా నిలిచి ప్రశంశాపత్రాన్ని అందుకున్న సందర్భంగా శనివారం ప్రముఖపల్మనాలజిస్ట్, నెల్లూరు డెల్టా హాస్పిటల్ ఎంవి డాక్టర్ పోకలరవి, జిల్లా పంచాయతీ అధికారిణి దూది వసుమతిశేషాద్రిబాలచందర్, ఏపి కాట్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బలిజసేవాఫౌండేషన్ ప్రధానకార్యదర్శి కమతం సుబ్బారావు తదితరులు ఘనంగా శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్తికేయ విద్యలోనే కాకుండా విన్యాసాల్లో కూడా సమర్ధవంతంగా వ్యవహరిస్తూ ప్రతిభ చూపాడని వారంతా కొనియాడి భవిష్యత్తులో నైపుణ్యాల విద్యతో ఉజ్వల భవిష్యత్తు పొందాలని, సాహసవిన్యాసాల్లో మరింత ప్రతిభ చూపి ఎన్నో అవార్డులు పొందాలని వారు ఆకాంక్షించారు. కార్తికేయ గీతాంజలి కాలేజిలో బిటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఎన్ఎస్ఎస్ జాతీయస్థాయిలో హిమాచలప్రదేశ్‌లో సాహసశిబిరానికి ఎంపికయ్యారు. రాష్ట్రం నుండి 80కళాశాలలవిద్యార్థులు హాజరుకాగా మననెల్లూరు జిల్లా నుండి కార్తీకేయ ఎంపికై పాల్గొనాడని వారు పేర్కొంటూ ఆవిద్యార్థి ప్రతిభను కొనియాడారు. రివర్‌ర్యాఫ్టింగ్, మౌంటెన్‌ట్రైకింగ్, సోషల్‌యాక్టివిటీప్‌లు నిర్వహించగా అన్ని విభాగాల్లో కార్తికేయ ప్రతిభ చూపారని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో చెక్కా కుమార్, రాజ్యం నరేంద్ర, పేలపోల ఆదిశేషయ్య తదితరులు కార్తికేయను అభినందించారు. డిపివో దూది వసుమతిశేషాద్రబాలచందర్ దంపతులను డాక్టర్ రవి, కమతం, తదితరులంతా ఘనంగా సన్మానించారు.

# ఆత్మకూరుకు పట్టణశోభ యోగం ఎన్నటికో..

- అన్నీ ఉన్నా.. అల్లుడినోట్లో శనిచందం..
- అటు వక్ఫ్.. ఇటు ఎండోమెంట్..





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు అనాదిగా పట్టణం.. నాడు తాలూకాకేంద్రం, నేడు రెవిన్యూ డివిజన్‌కేంద్రం.. మెయిన్‌రోడ్డును గతంలో మంత్రి ఆనం చొరవతో విస్తరించారు.. సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు.. మంచి విద్యా, వైద్య సదుపాయాలు కల్పించి అధునాతన భవనాలు నిర్మించారు. వ్యాపారసంస్థలు ఆధునీకరించారు.. అన్నిశాఖల కార్యాలయాలు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల.. అయితే అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని చందంగా మెయిన్‌రోడ్డుకిరువైపులా వక్ఫ్‌స్థలాలు, ఎండోమెంట్ స్థలాలు ఉండడంతో పట్టణ శోభతలపించడం లేదు. రోడ్డు కిరువైపులా పెద్ద హొటళ్ళు, దుకాణాలు, షోరూమ్‌లు ఏర్పాటు చేసుకునే పరిస్థితి లేనందున చిన్నపాటి రేకుల షెడ్లలో దుకాణాలు ఏర్పాటుచేసుకొని వ్యాపారాలు సాగిస్తుంటారు. డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేదు. పంటకాలువలు కూడా పూడిపోయి ఉన్నాయి. రోడ్లమీద గోవులు, మేకలు, కుక్కలు, సంచరిస్తుంటాయి. పట్టణ నడిబొడ్డున మున్సిపల్ బస్టాండును అధునాతనంగా నిర్మించినా అక్కడ కనీసవసతులు లేవు. త్రాగునీటికి ఇబ్బందిపడు తుండగా నిత్యాన్నదాత కంచిపరమేశ్వరరెడ్డి త్రాగునీటిని సరఫరాచేస్తున్నారు. అక్కడ ఫలహార శాలకానీ, హొటల్‌కానీ లేవు. పట్టణంలో ఒక తిప్ప ఉండగా ఆతిప్పపై పలు ప్రభుత్వ కార్యాలయాలు, నివాసగృహాలు ఉండగా పట్టణాన్ని రాత్రివేళ ఊరివెలుపలినుండి చూస్తుంటే లైటింగ్ తో ఆకర&షణీయంగా కన్పిస్తుంటుంది. కానీ పట్టణంలోకి వస్తే ఆశోభ కానరావడం లేదు. చెరువువద్ద సుందరీకరణకు మంత్రి ఆనం చర్యలు తీసుకోనున్నారు. కానీ పట్టణంలో ఇతర పట్టణాల్లోలాగా ఆకర్షణీయంగా షోరూమ్‌లు, హొటళ్లు ఏర్పాటుచేసుకునే పరిస్తితి లేదు. మెయిన్‌రోడ్డుకు ఒక వైపు వక్ఫ్‌స్థలం, మరో వైపు ఎండోమెంట్ స్థలం ఉన్నందున దుకాణాల ఏర్పాటుకు వీలుకావడంలేదు. పట్టణంలోని కొన్నిప్రాంతాల్లో గతంలో పొలాలుగా ఉన్నవాటిని పలువురు స్థలాలుగా కొనుగోలు చేసి అధునాతన భవనాలు నిర్మించుకున్నారు. కానీ ప్రధాన రహదారి మాత్రం అధునీకరణ కావడం లేదు. మంత్రి, అధికారులు చొరవచూపి వక్ఫ్, ఎండోమెంట్ స్థలాలను కొంతమేరకు భవనాల నిర్మాణాలకు అనుమతి సాధిస్తే మెయిన్‌రోడ్డు సుందరంగా ఆకర్షణీయంగా మారగలదని పలువురు భావిస్తున్నారు. మరి అలాంటి చర్యలు చేపడతారేమో చూడాల్సి ఉంది.

# ఏపీ టీచర్స్ టోర్నమెంట్ను ప్రారంభించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్లో టీచర్స్ టోర్నమెంట్ను కు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కావ్య హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులు ఉపాధ్యాయులు అధికారులు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం టోర్నమెంట్ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి క్రీడాకారున్ని పరిచయం చేసుకున్నారు. క్రీడాకారులతో కలిసి సరదాగా కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులు ఉత్సాహాన్ని నింపారు. క్రీడలు శారీరక ధ్రత్వం మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమని ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొనడం విద్యార్థులకు మార్గదర్శకమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం గిరిజన పాఠశాలకు

# మౌలిక సదుపాయాలు కల్పించండి

**మాజీ ఎంపీటీసీ కారం చేటి శివరామ ప్రసాద్ శర్మ**




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామంలోని దిబ్బ మీద గిరిజన కాలనీ రాష్ట్ర ప్రభుత్వ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించే అంశాన్ని అదాని ఫౌండేషన్ చేపట్టాలని స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యులు, కృష్ణపట్నం ఆలయాల మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కారం చేటి శివరామ ప్రసాద్ శర్మ కోరారు. శనివారం సాయంత్రం ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ గిరిజన కాలనీ లోని స్కూలను సందర్శించి అక్కడ సమస్యల పైన అధ్యయనం చేశారు. స్థానిక ఎంపిటిసి సభ్యులతో పాటు మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్ విచ్చేశారు. గిరిజన పాఠశాల విద్యార్థుల సమస్యలను మాజీ ఎంపిటిసి ఫౌండేషన్ సి ఎస్ ఆర్ హెడ్ రాజేష్ రంజన్ కు తెలియజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని మాజీ ఎంపీటీసీ కోరారు. విద్యార్థులకు అవసరమైన ఏకరూప దుస్తులు ఇస్తామని ఫౌండేషన్ హామీ ఇచ్చింది. అదేవిధంగా త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, క్రీడ సామాగ్రితోపాటు విద్యా వస్తువులు సమకూరుస్తామని తెలియజేశారు. మరుక్షణమే పనులు ప్రారంభించే విధంగా చర్య తీసుకుంటామని పౌండేషన్ ప్రతినిధులు చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజా, స్థానికులు ముంగరగిరి, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కోరిడ్ కార్యాలయం నందు క్రిస్మస్ సంబరాలు

**ముఖ్య అతిథిగా హాజరైన రావెల అనురాగ్ పాల్**




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో బాపూజీ నగర్‌లో ఉన్న కోరిడ్ సమస్తఆధ్వర్యంలో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరిడ్ సమస్త డైరెక్టర్ రావెల అనురాగ్పాల్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రిస్మస్ అంటే ఒకరి పట్ల ఒకరు ప్రేమ కలిగి, సహాయం చేయడం ఒకరిని ఒకరు ప్రేమించుకోవడం మంచి మనస్తత్వం కలిగి ఉండడమే క్రిస్మస్ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అలాగే లేనివారికి సహాయం చేయడం కోరిడ్ సమస్త ఆధ్వర్యంలో కావలి గ్రామీణ ప్రాంతాల్లో పేద గిరిజనులకు చేస్తున్న ఉచిత వైద్య శిబిరం ఉచిత కంటి శిబిరం మరియు విద్యార్థులకు అక్షరాభ్యాసాన్ని కూడా చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సమస్త చేస్తున్న సేవలను డైరెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కొరిడ్ సమస్త లో పనిచేస్తున్న పేద గిరిజన గ్రామాల్లోని 150 మందికి చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బి.ప్రనిల్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం క్యాండిల్ లైట్ సర్వీస్, కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో కొరిటి సమస్య సూపర్వైజర్ ఆర్.రవి కుమార్ దంతం సునీల్, కోరిడ్ సమస్త సిబ్బంది పాల్గొన్నారు.

# అధికార అండదండలతో దళితులపై దౌర్జన్యం

▸ ఎమ్మెల్యే అండదండలతోనే దళితులపై రెచ్చిపోతున్న ఓ చోట నాయకుడు ▸ ఎమ్మెల్యే పేరు చెప్పుకొని లక్షలు వసూలు చేసిన చోట నాయకుడు ▸ ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో దళిత మాదిగ రైతులు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని పాలూరు గ్రామ పంచాయతీ పరిధిలో మాదిగ జాతికి చెందిన దళితులు 1973 సంవత్సరం నుంచి సేద్యం చేసుకుంటున్న మెట్ట పొలాలను ఏ విధంగా పట్టాలు చేయించుకోవాలో దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్న మాదిగ దళితరైతులను, అదే గ్రామానికి చెందిన సుబ్బరామ నాయుడు అనే వ్యక్తికి కొంత టైం వరకు మాట పట్టుల మీద పదేళ్ల కిందట అతను దళితులు సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నటువంటి పొలాలను జామాయిల్ కర్ర వేసుకొని నేను సేద్యం చేస్తానని, మొదట కటింగ్ అయిపోగానే మీకు రెండువ కటింగ్ ఇచ్చి పట్టా పాస్ బుక్‌లు చేయిస్తానని మాట చెప్పారని దళితులు తెలిపారు. ఆ అనంతరం దళితులను మభ్యపెట్టే ప్రక్రియలో భాగంగా ఫస్ట్ కటింగ్ అయినప్పటికీ మాదిగ రైతులు సుబ్బరామ నాయుడు మాకు జామాయిల్ కర్ర ఫస్ట్ కటింగ్ అయిపోంగానే మాకు పట్టా పాస్బుక్కులు చేస్తామని చెప్పి ఉన్నారు కదా, అయితే మీరు చెప్పిన విధంగా మాకు చేయలేదు కాబట్టి మీరు పది సంవత్సరాలు చేసుకున్న కాలానికి మాకు గతంలో 8వేల రూపాయలు చొప్పున ఇచ్చినారు కాబట్టి మీరు పాస్ బుక్కులు చేయించే విషయంలో విఫలమయ్యారు కాబట్టి మేము జామాయిల్ కర్రను రెండవ కటింగు చేయడానికి మాకు సమ్మతం లేదని హెచ్చరించినప్పటికీ దళితులు అన్న చిన్నచూపుతో మీరంతా మీ బతుకులు ఎంత అన్న ధోరణిలో మాట్లాడుతూ.. పలు రకాలుగా దూషిస్తూ మా మాట వింటే మీకు ఆ భూములైన మిగులుతాయి మేము ఆ కర్ర కటింగ్ చేసుకొని పోతాము లేకపోతే ఏదీ కాకుండా పోతారని దళిత మాదిగలను భయాందోళనలకు గురి చేస్తున్నారని పాలూరు దళిత సర్పంచి భర్త అయినటువంటి తలమల మస్తానయ్య ఆవేదన వ్యక్తపరిచారు. అంతేకాకుండా ఈ జామాయిల్ కటింగ్‌లో దళిత మాదిగలందరూ కలిసికట్టుగా ఒకే మాట మీద ఉండి అడ్డుకోవడంతో ఏం చేయాలో దిగ్గుతోచినటువంటి సుబ్బరామ నాయుడు తన పలుకుబడులతో రాజకీయ ప్రలోబలంతో తూర్పుపూండ్ల గ్రామానికిచెందిన సోసైటీచైర్మన్ అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు అనే వ్యక్తిని ద్వారా మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసి మీరు నేను చెప్పినట్లు వింటే మీకు కొంతమేర న్యాయం జరుగుతుందని లేకపోతే ఏ పొలం కూడా మీకు దక్కదని దళిత మాదిగలను హెచ్చరించారని తమల మస్తానయ్య తెలుపుతూ ఈ సుబ్బరామ నాయుడు అనే వ్యక్తికి దళితులు ఎవరు కూడా మాట వినక పోయేసరికి సైదాపురం మండలంలో మండల పెత్తనం మొత్తం కూడా తూర్పు పూండ్ల అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు వ్యక్తి చెప్పినట్టు ఉంటుందని భావించి ఈ సుబ్బ రామ నాయుడు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు ఇద్దరూ రాజకీయ



అండదండలతో రెచ్చిపోతున్న తరుణంలో ఏం చేయాలో దిక్కుతోచక మాదిగ దళిత రైతులు జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించడం జరిగిందని ఆ తరువాత జిల్లా కలెక్టర్ దళితులను ఇబ్బంది పెట్టొద్దు వారిని వారి జామాయిల్ కర్రను దళితులే కొట్టుకోమని ఆదేశించినప్పటికీ అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు అనే వ్యక్తి అధికారుల ద్వారా తమను భయాందోళనకు గురి చేసినట్టు తెలిపారు. అంతే కాకుండా జామెయిల్ కోను గోలు చేసే వారిని కూడా బెదిరెంచడంతో సుబ్రమణ్యం నాయుడు అనే వ్యక్తి ఈ జామాయిల్ కర్ర విషయంలో మా దగ్గర నుండి 12 లక్షల రూపాయలు వసూలు చేశారని మా దగ్గరే కాకుండా జామాయిల్ కటింగ్ కొనుగోలు చేసుకుని పోయే వ్యక్తి దగ్గర కూడా ఐదు లక్షల రూపాయలు వసూలు చేశారని తమల మస్తానయ్య గ్రామస్తులు ఆవేదన వ్యక్తపరిచారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీ పరిధిలో వచ్చినటువంటి చిన్న చిన్న పనులకు కూడా ఆటంకాలు కలిగిస్తున్నట్టు నేను చెప్పిందే జరగాలి మేము చెప్పిందే చేయాలి. అంతేగాని నువ్వు చెప్తే చేసేదేంది అన్నటువంటి విషయాలపై దళిత సర్పంచ్ ఏం చేయాలో దిక్కుతోచక పరిస్థితిలో ఉన్నామని పాలూరు సర్పంచ్ భర్త తమల మస్తానయ్య తెలిపారు.

### రెయిన్ బో చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు

## నెల్లూరుకి విస్తరణ

**రెయిన్ బో చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కంచర్ల రమేష్**




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్థానిక మినర్వా గ్రాండ్ హొటల్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో భారతదేశంలో ప్రముఖ పీడియాట్రిక్ మల్టీ స్పెషాలిటీ పెరినాటల్ కేర్ విభాగాలలో రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఒకటి ఈరోజు నెల్లూరు, గూడూరు పట్టణాలకు తమ సేవలను అందిస్తున్నామని, చెన్నై నందు చిన్న పిల్లల కొరకు 300 పడకల, 100 ఇంటెన్సివ్ కేర్ పడకలు కలిగి, చిన్నపిల్లలకు అత్యంత క్లిష్టమైన సేవలు అందిస్తున్నామని, దీనిపై ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారని చిన్నపిల్లల వైద్యంలో నెల్లూరు నగరంలోని చిన్న పిల్లల వైద్య నిపుణులతో సంప్రదింపులు జరిపి రోగులకు తమ సేవలు అందించడంలో విశేషంగా కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం రెయిన్ బో చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నెల్లూరులో ఆవిష్కరణ సందర్భంగా వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కంచర్ల రమేష్ మాట్లాడుతూ.. నేను ఇక్కడ వాడినే (నెల్లూరు ) నేను ఇక్కడ చదువుకోవడం వల్లనే నాకు ఈ ప్రాంత ప్రజలతోనూ, నా సహాధ్యాయులైన డాక్టర్ మిత్రులతో నాకు చాలా కాలం అనుబంధం ఉంది. ఈ ప్రాంతంలో పిల్లల వైద్య సేవలను విస్తరించటం నాకు చాలా సంతోషకరంగా ఉందని తెలియజేశారు. వైద్య చికిత్సల కోసం పిల్లలు తల్లులు నుండి పెద్దల వరకు ప్రత్యేక చికిత్సల కోసం చెన్నైకి తీసుకొని వెళ్ళుటకు నా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఈరోజు ఆరంభమైన రెయిన్ బో చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు నగరంలోని ప్రసూతి బృందాలు, పిల్లల బృందాలతో సున్నిహితంగా సహకరిస్తుంది. వారి స్పెషాలిటీ కేర్ అవసరాలను అర్థం చేసుకుంటుంది మరియు వారితో కలిసి పని చేస్తుందని తెలియజేశారు. అనంతరం జోనల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణ ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ ఎన్‌సిఆర్, తూర్పు భారతదేశంలో అంతట పటిష్టమైన హాస్పిటల్ నెట్ వర్క్‌ను రెయిస్ బో చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కలిగి ఉందని తెలియజేశారు.

## కామ్రేడ్ పెంచలయ్య సంతాప సభ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రోడ్డు మార్జిన్ వ్యాపారస్తుల సంక్షేమ సంఘం సిఐటియు నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయి డ్రగ్స్ మాఫియాచే హత్య చేయబడిన సీపీఎం కార్యకర్త కామ్రేడ్ కే పెంచలయ్య సంతాప సభ నెల్లూరు టౌన్ హాల్ లో 15-12-2025 తేదీ సోమవారం నాడు ఉదయం 10 గంటలకు టౌన్ హాల్ నందు సంతాప సభ నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సంతాప సభకు సిపిఎం పొలిటి బ్యూరో సభ్యులు కామ్రేడ్ వాసు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మూలం రమేష్ హాజరు కావడం జరుగుతుందని తెలియజేశారు. కావున కార్మికులు కర్షకులు రోడ్డు మార్గంలో ఉన్న కార్మికులందరూ సంతాప సభకి రావాలని రోడ్డు మార్గం కార్మికులకు వేదయపాలెం సెంటర్ నుంచి కొండాయపాలెం గేట్ వరకు కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ అధ్యక్షులు ఎం.సుధాకర్, రోడ్డు మార్జన్ నాయకులు షేక్ ఖాజావలి, పుట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్టార్టప్‌లకు ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అవసరం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ఔత్సాహిక పారిశ్రామికవేత్తల విజయానికి సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా సరైన మానసిక దృక్పథం, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ కూడా అత్యంత అవసరమని చెన్నై సాయి యూనివర్శిటీకి చెందిన ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ఎస్‌విఎన్ తేజశ్వి అన్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ టూరిజం మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారం రోజుల స్టార్టప్ సామర్థ్య నిర్మాణ సదస్సు మూడవ రోజున ఆమె రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఒక స్టార్టప్ విజయవంతంగా నిలదొక్కుకోవాలంటే వ్యక్తిగత వికాసం, భావోద్వేగాల నియంత్రణ ఎంతో కీలకమని ఆమె స్పష్టం చేశారు. వినియోగదారుల ప్రవర్తనను అర్థం చేసుకోవడం, వారి అవసరాలకు అనుగుణంగా వ్యాపార వ్యూహాలు రూపొందించడం ద్వారా సంస్థలు విజయవంతమవుతాయని తెలిపారు. స్టార్టప్‌లలో టీమ్ బిల్డింగ్, సమర్థ నాయకత్వం, వ్యాపారంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడంలో ఎమోషనల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాత, కో-కోఆర్డినేటర్ ఎం.విక్రమ్ కుమార్‌తోపాటు ఇతర అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నవోదయ పరీక్షకు 143 మంది విద్యార్థులు హాజరు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం శనివారం జడ్పీ హైస్కూల్ నందు జవహర్ నవోదయ విద్యాలయ పరీక్షను నిర్వహించింది. ముత్తుకూరు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఈ పరీక్షకు 143 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని తహసిల్దార్ స్వప్న తనిఖీ చేసినారు. ఈ కేంద్రం వద్ద పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. పరీక్ష నిర్వహణ సక్రమంగా సాగిందని మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్ తెలిపారు.

## విద్యాశాఖ అధికారుల తీరుతో పేదలకు

# ప్రభుత్వ విద్య దూరం

- ఉపాధ్యాయుడు పాఠశాలలకు రావడమే గగనం
- తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాల వైపు చూపు
- ఒకనాడు వెలుగు వెలిగిన పాఠశాల నేడు వెలవెల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** విద్యాశాఖ అధికారుల తీరుతో కడు పేద పిల్లలు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారు పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయుడు రావడమే గగనంగా మారింది ఎప్పుడో ఆయనకు తీరిన సమయంలో అలా వచ్చి వెళ్లడంతో పాఠశాలలోని విద్యార్థులు చదువు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని అర్థం చేసుకున్న తల్లిదండ్రులు ఇష్టం లేకపోయినా ప్రైవేట్ పాఠశాల వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలానికి ఎక్కడో మూలన దూరంగా ఉందని ఉద్దేశంతో అక్కడికి ఏ అధికారులు రారని పరిశీలించరని భావనతో ఉపాధ్యాయుడు వెళ్లడం తరచుగా మారింది. ఈ పరిస్థితి వింజమూరు మండలం జనార్ధనపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలది. ఈ గ్రామంలో సుమారు 850 మంది జనాభా ఉండగా వారిలో అధిక శాతం ఎస్సీ బీసీ ఎస్టీ వర్గాలు చెందిన కుటుంబాలు ఎక్కువగా ఉండడంతో వారంతా ప్రతిరోజు కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు ఆ పరిస్థితుల్లో ప్రైవేటు పాఠశాలలకు పంపలేక ప్రభుత్వ పాఠశాలలోనే చదివించుకుందామని ఆశతో ఉన్నారు కానీ ఇక్కడి పరిస్థితి చూసి తట్టుకోలేకపోతున్నారు పాఠశాల మొదట్లో సుమారు 70 మంది విద్యార్థులు ఆరేడు మంది ఉపాధ్యాయులతో కలకలలాడుతూ ఉంది కానీ నేడు ఇద్దరు ముగ్గురు విద్యార్థులతో వెలవెలలాడుతూ తన పూర్వవైభవాన్ని కోల్పోతుంది 2021 ముందు 40 మందివిద్యార్థులు ఉండగా 2021లో ఒక ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్ళగా మరొక ఉపాధ్యాయుడు మాత్రమే ఇక్కడ పని చేస్తూ ఉన్నారు కానీ ఈ ఉపాధ్యాయుడు ఇక్కడ ఉన్న సమయంలోనే పరిస్థితి తిరగబడింది 40 మంది విద్యార్థులకు కేవలం నలుగురు మాత్రమే మిగిలారుఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గత ఏప్రిల్ నెలలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో జలదంకి మండలం వేములపాడుకు బదిలీ అయ్యారు అయితే జనార్ధన పురంకు రిలీవర్‌గా ఏ ఉపాధ్యాయుడు రాకపోవడంతో ఆయన ఇక్కడే పని చేయాల్సి వచ్చింది విధులు జనార్ధనపురం వేతనం జలదంకి మండలంలో తీసుకోవడం జరుగుతుంది. కానీ ఇదంతా మండల విద్యాశాఖ అధికారుల కు తెలిసే జరుగుతున్నది వాస్తవం కాగా శనివారం నిబంధనలకు విరుద్ధంగా ఒక డిప్యూటేషన్ పై టీచరు ఉండాల్సి ఉండగా కేవలం ఎంఈఓ కార్యాలయంలో అవుట్సోర్సింగ్ అటెండర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని డిప్యూటేషన్ పై పంపడం ఎంఈఓ మధుసూదన్ రెడ్డి తీరుకు నిదర్శనమని ఎంఈఓ విధి నిర్వహణలో ఎంత నిర్లక్ష్యము ఉదాహరణగా నిలుస్తుంది. ఈ విషయంపై గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాల ఉండి కూడా కూలినాలీ చేసుకుని ప్రైవేట్ పాఠశాల పంపాల్సిన దుస్థితి మా గ్రామానికి పట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ విషయంపై ఎంఈఓ మధుసూదన్ రెడ్డిని వివరణ కోరగా మొదట కావలిలో స్పోర్ట్స్ జరుగుతున్నాయని తెలిపి మరలఆ ఉపాధ్యాయుడుకు కడపలో యూనియన్ మీటింగ్ ఉన్నదని వెళ్లడంతో అక్కడికి ఏ ఉపాధ్యాయుడు వెళ్ళకపోవడం వలన పాఠశాల మూత వేయకూడదని ఉద్దేశంతో మా అటెండర్ను పంపించినట్లు తెలిపారు ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయునికి జలదంకి మండ కార్యాలయం వారు సెలవు మంజూరు చేశారని కేవలం మా కార్యాలయంకు ఆ ఉపాధ్యాయుడు సెలవు సమాచారం తెలియజేసి వెళ్లాడని తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేసి త్వరలోనే మరో ఉపాధ్యాయుని నియమిస్తామని తెలిపారు.

## నేడే ఆత్మకూరులో రైతన్నా.. మీకోసం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని వ్యవసాయమార్కెట్‌కమిటీ ఆవరణలో ఆదివారం రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సారధ్యంలో రైతన్నామీకోసం కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నారు. ఈమేరకు శనివారం ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ ప్రతినిధులు, పార్టీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, కార్యవర్గప్రతినిధులు, కార్పోరేషన్ల డైరెక్టర్లు, సాగునీటిసంఘాల, ప్రాధమిక వ్యవసాయ పరపతి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, వ్యవసాయ, మార్కెటింగ్, సాగునీటి శాఖల అధికారులతో ఈసమావేశం నిర్వహించనున్నారు. అందరూ తరలిరావాలని వారు కోరుతున్నారు. ఏఎంసి చైర్మెన్ జనార్ధన్‌నాయుడు కార్యక్రమంలో ఎలాంటి అసౌకర్యం లేకుండేలా ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జహవర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి సంబంధించి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 216 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 116 మంది హాజరైనట్లు చీఫ్ సూపరిండెంటెంట్ గుంటుపల్లి శ్రీనివాసులు, అబ్జర్వర్ యము నాలక్ష్మిలు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో బం దోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్) వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రత్నం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ సహకారంతో శనివారం పిడతా పోలూరు గ్రామం నందు ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. అక్కడకు విచ్చేసిన 100 మంది రోగులకు నెల్లూరు చెందిన వాసన్ ఐ కేర్ కంటి వైద్యశాల నిపుణులు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 30 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినారు. కంటి ఆపరేషన్లు రాష్ట్ర ప్రభుత్వ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తామని ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం తెలిపింది. ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై ప్రపూర్ణ చంద్ర కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి తన చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం వారం రోజులు పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మూడు విభాగాల ఫార్మసీ విద్యార్థులను అభినందిస్తున్నామని తెలిపారు. ఉండాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి వేణుగోపాలయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై రమేష్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎన్ కృష్ణ నరేష్, ఆశ వాలంటీర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సహాయ మంత్రిని కలిసి ఎమ్మెల్యే కాకర్ల



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్‌ను శనివారం గుంటూరులో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి, పక్కా గృహాల మంజూరు, రహదారుల నిర్మాణం, సెల్ఫోన్ టవర్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజక వర్గానికి అన్నివిధాల సహకరించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## మండపం కొరకు స్థలం పరిశీలన



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామంలో శివాలయం వద్ద కర్మ క్రతువుల మండపం కొరకు స్థలాన్ని వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సౌత్ మోపూర్ గ్రామంలోని అన్ని పార్టీ నాయకులతో చర్చించి గ్రామ ఖర్మ క్రతువుల మండపం స్థలాన్ని పరిశీలించడం జరిగింది. అనంతరం చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు అవసరమైన కర్మ క్రతువుల మండపని అతి త్వరలో నిర్మించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 15న అటల్ బీహారి వాజపేయి విగ్రహ ఆవిష్కరణ

- సుపరిపాలన యాత్ర విజయవంతం చేయండి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుప తలపెట్టిన అటల్ మోదీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పై సుపరిపాలన యాత్రలో జిల్లా నలుమూలల నుంచి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. పై కార్యక్రమం డిసెంబర్ 15వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక అయ్యప్ప గుడి సెంటర్ నుంచి బైక్ ర్యాలీతో ప్రారంభమై వేదయపాలెం, కేవిఆర్ పెట్రోల్ బంక్, ఆర్‌టిసి, విఆర్ సి మీదుగా ప్రయాణించి హరినాథపురం జంక్షన్ వద్ద వాజపేయి విగ్రహ ఆవిష్కరణ జరిగిన తదుపరి బహిరంగ సభతో కార్యక్రమం ముగుస్తుందని పై కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఢిల్లీ ముఖ్య మంత్రి శ రేఖా గుప్తా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య విద్య సామాజిక కుటుంబ ఆరోగ్య శాఖ మాత్యులు వై.సత్యకుమార్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఇతర రాష్ట్ర జాతీయ నాయకులు పాల్గొంటారని అలాగే కూటమికి సంబంధించిన పార్టీల నాయకులు పై కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్రరెడ్డి, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కర్నాటి ఆంజనేయ రెడ్డి, భరత్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీకి రిటర్న్ గిఫ్ట్

- టీడీపీ లోకి క్యూ కడుతున్న వైఎస్సార్సీపీ కార్పొరేటర్లు
- మంత్రి నారాయణ వ్యూహాలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఫ్యాన్ పార్టీ
- టీడీపీని గెలికి తప్పుచేసామని తలలు పట్టుకుంటున్న వైసీపీ నేతలు
- మంత్రి నారాయణ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్న మరో ఇద్దరు వైసిపి కార్పొరేటర్లు
- ఫలించిన మంత్రి నారాయణ వ్యూహం
- అవిశ్వాస తీర్మానం వేళ మరో కోణం చూపించిన క్లాస్ మినిస్టర్ నారాయణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో మంత్రి నారాయణ వ్యూహాలకు ఫ్యాన్ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మేయర్‌పై అవిశ్వాసం నేపథ్యంలో సింహపురి రాజకీయం కొత్త మలుపులు తిరుగుతుంది. మంత్రి నారాయణ ఎప్పుడూ డెవలప్మెంట్ అంటూ తిరుగుతారని. రాజకీయం తెలీదు అనుకున్న వైసీపీ పప్పులో కాలు వేసింది. అవిశ్వాస తీర్మానం వేళ అభివృద్ధి మంత్రిగా పేరు గాంచిన నారాయణ మరో కోణం చూపించారు. వ్యూహాత్మక ఎత్తుగడలతో ఫ్యాన్ పార్టీ నేతల ఎత్తులను చిత్తు చేసారు. వైసిపి అధినేత జగన్ సమక్షంలో కండువాలు కప్పించుకొన్న కార్పొరేటర్లు మరల టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇవాళ తాజాగా వైసిపి నగర అధ్యక్షుడే పార్టీ మారిపోవడంతో ఆ పార్టీ నాయకులు అయోమయంలో పడిపోయారు. మంత్రి నారాయణ సమక్షంలో ఇద్దరు వైసిపి కార్పొరేటర్లు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ముందుగా 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లా, అనంతరం 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ పార్టీలో చేరారు. అనంతరం కార్పొరేటర్లు మాట్లాడుతూ మంత్రి నారాయణ. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి టీడీపీలో చేరానని, తాను వైసీపీలో ఉన్నప్పటికీ మంత్రి నారాయణ అనేక రకాలుగా సహాయం చేశారన్నారు. ఎప్పుడూ పార్టీ మారాలని నన్ను అడగలేదని, నేను స్వచ్ఛందంగానే వైసీపీ నుంచి టీడీపీ లో చేరరన్నారు. మిగిలిన 11 నెలల పదవీ కాలంలో నగర అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో టీడీపీలో చేరారని తెలిపారు. నేను పార్టీ మారడం వెనుక ఎవరి ప్రోద్భలం లేదన్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం గెలిచి తిరుతామన్నారు. అనంతరం టీడీపీ అధికార ప్రతినిధి మాట్లాడుతూ.. నెల్లూరు మేయర్ స్రవంతి ఎప్పుడూ మేయర్‌గా వ్యవహరించలేదన్నారు. రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరు అని మంత్రి నారాయణ చెప్పారన్నారు. కార్పొరేటర్లు స్వచ్ఛందంగా పార్టీ మారి నగర అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయించారని, వైసీపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు భాష వల్లే 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసారని, కేవలం అభివృద్ధి కోసమే కార్పొరేటర్లు పార్టీ మారుతున్నారన్నారు. రోజుకో రిటర్న్ గిఫ్ట్ అందుకొంటున్న వైఎస్సార్సీపీ నేతలు టిడిపిని అనవసరంగా కెలికి తప్పు చేశామని తలలు పట్టుకుంటున్నారు.

# కన్నుల పండువగా మండల పూజలు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వేదాయపాలెం అయ్యప్ప స్వామి దేవస్థానంలో కేరళ సాంప్రదాయ మండలం పూజలు శనివారం రోజున ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సుగంధ పుష్పాలు, దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కేరళ సాంప్రదాయ ఆర్చక తంత్రులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వామి వారికి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకంతో పూజలు మొదలయ్యాయి. భక్తుల కోరిక మేరకు మహాగణపతి హోమం, కలశపూజ, నవకాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ సుగంధ పుష్పాలతో స్వామి వారికి ఉష‘ పూజ, శ్రీ వేలి ఉత్సవం అట్టహాసంగా జరిగాయి. పగలు ఉచ్చ పూజ తర్వాత మహా పుష్పాభిషేకం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం వేళలో పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం సేవ జరిగాయి. గురువాయూరప్పన్‌కు మహా పుష్పాభిషేకం మండల పూజల సందర్భంగా శ్రీదేవి భూదేవి సహిత గురువాయురప్పన్ మహావిష్ణు స్వామి వారికి మహా పుష్పాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. మహాదీపారాధన విశేషపుష్పాలంకరణ పూజలకు మరింత శోభను తెచ్చాయి. ఈ సంవత్సరం మండల పూజలకు, విశేష పుష్పాలంకరణ, పుష్పాభిషేకం, అన్నదానం, రాత్రి బిక్షలకు దేవెళ్ల శ్రీనివాసరెడ్డి, నిర్మలమ్మ దంపతులు, దేవెళ్ల శ్రీధర్ రెడ్డి, సుప్రజా దంపతులు, వరిదిరెడ్డి హరినాథ రెడ్డి, మైథిలి దంపతులు, వరిదిరెడ్డి హిమవంత్ రెడ్డి, కాత్యాయని దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమాలు ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణలో జరిగాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కత్తి మోహన్ రావు, కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్ రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్ చంద్రతో పాటు పలువురు అయ్యప్ప స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## వడ్లతాంగల్ చెంగల్రాయ రెడ్డి శ్రద్ధాంజలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తి పట్టణంలో వైయస్సార్ సర్కిల్ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బి.సి. సంఘం అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజి ప్రసాద్‌రెడ్డి తండ్రికి కీ:శే:వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి 6 వవర్ధంతి సందరరేగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ముందుగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినారు అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందరరేగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈ రోజు వడ్లతాంగల్ చెంగల్రాయ రెడ్డి 6 వవర్ధంతి సందరరేగా కుమారుడు రాష్ట్ర బి.సి. సంఘం అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజి ప్రసాద్ రెడ్డి మిత్రబృందం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఇటువంటి యాంత్రిక జీవితంలో కూడా తండ్రి మరణించి ఆరు సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ కూడా భౌతికంగా దూరమైన ఆయన జ్ఞాపకాలను గుర్తుంచుకుంటూ ప్రతి సంవత్సరం నిరుపేదలకు అన్నదానం చేయడం అనేది బాలాజీ ప్రసాద్ యొక్క సంస్కారంకి నిదర్శనం అని తెలియజేశారు. ఈ యొక్క ఆలోచన విధానం ప్రత కుటుంబలో ప్రతి బిడ్డకి రావాలని తెలియజేశారు.

## వైసీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులుగా ఉయ్యాల ప్రతాప్ రెడ్డికి చోటు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువవజన విభాగంలో మండలంలోని తాటిపర్తి గ్రామ పంచాయతీకి చెందిన యువకుడు ఉయ్యాల ప్రతాప్ రెడ్డికి పార్టీ కేంద్ర కార్యాలయం చోటు కల్పించింది. రాష్ట్ర మాజీమంత్రి, జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, సర్వేపల్లి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని) సహకారంతో జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా నియామకం కావడం జరిగింది. గ్రామంలో అనేక సేవలు చేస్తూ పార్టీ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా చురుకుగా పాల్గొంటూ పార్టీకి సేవ చేస్తున్న తరుణంలో పార్టీ అధిష్టానం యువజన విభాగంలో కీలకమైన బాధ్యతను అప్పగించింది. ఈ మేరకు జిల్లాస్థాయిలో వైకాపా యువజన విభాగం ఉపాధ్యక్షులుగా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా **మేజర్‌న్యూస్‌**తో మాట్లాడారు. యువకుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేస్తూ అండగా ఉంటామని అన్నారు. పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా చేస్తామని ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు.

## ఉచిత డయాబెటిస్ ఫుట్ చెకప్

**కుప్పం, మేజర్‌న్యూస్ :** కుప్పం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 15న నిర్వహించే ఉచిత డయాబెటిక్ ఫుడ్ చెకప్‌ను కుప్పం పట్టణంలోని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని డా.వినయ కోరారు.కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సహకారంతో బెంగళూరు మహావీర్ జైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 15వ తేదీ కుప్పంలో ఉచిత డయాబెటిస్ చెకప్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డా.వినయ తెలిపారు. కుప్పం ఏరియా ఆసుపత్రిలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఫుట్ చెకప్ క్యాంపు నిర్వహించనున్నారు. రక్తంలో చక్కెర స్థాయి పరీక్ష, బిపి, సెన్సిటోమీటర్ ఉపయోగించి నరాల పరీక్ష, రక్త పరీక్ష బాగుందో లేదో తెలుసుకోవడానికి ఫుట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## మమతకు కెనడా ఆహ్వానం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** పద్మావతి మహిళ విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్‌లో ప్రొఫెసర్ డాక్టర్ మమత బృందానికి కెనడా యూనివర్సిటీ ఆహ్వానం పంపింది. టొరంటోలో జరిగే ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ అకాడమిక్ ఎక్సలెన్స్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనను న్నారు. ఈనెల 16 నుంచి రెండు రోజులు పాటు జరిగే కార్యక్రమంలో ఆమెతోపాటు కే.హరిప్రియ రామక ృషా రావు, పాల్గొననున్నారు.

## ఏఎంసి చైర్మన్ రంగినేనికి శుభాకాంక్షలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్ చైర్మన్ గా రంగినేని చెంచయ్య నాయుడు మూడవ సారి ఎన్నికై నేడు ప్రమాణ శ్రీకారం చేసిన సందర్భంగా శ్రీకాళహస్తి ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు ఆయన కుమారుడు ఎంజిఎం డైరెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ గుడ్లూరు మయూర్ చెంచయ్య నాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున నాయుడు, మయూర్‌లతో పాటు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి నాయకులు పాల్గొన్నారు.

## బోరు మోటార్ల.. కేబుల్ వైర్లు చోరీ

**కుప్పం, మేజర్‌న్యూస్ :** బోరు మోటార్‌కు సంబంధించిన కేబుల్ వైర్లను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మండల పరిధిలోని మల్లనూరు -వేపూరు మార్గంలోని చోటుచేసుకుంది. కుప్పం మండలం, మల్లనూరు పంచాయతీ పరిధిలో బోరు మరమ్మత్తు కోసం పైపులు, కేబుల్‌ను బయటకు తీయగా రాత్రి కేబుల్ చోరీకి గురి అయిందని పంచాయతీ కార్యదర్శి రమ్యలక్ష్మి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. మల్లనూరు -వేపూరు మార్గం లోని ఆర్డబ్ల్యూఎస్ బోరు రిపేరి కాగా మరమ్మ తులు చేసేందుకు పైపులు కేబుల్ బయటకు తీయగా రాత్రి కేబుల్ ను దొంగలు తీసుకెళ్లారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ప్రశాంతంగా నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలల్లో శనివారం జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష-2026 ప్రశాంతంగా జరిగిందని డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు 2060 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 1212 మంది విద్యార్థులు హాజరయ్యారని, 848 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలియజేశారు.

# శ్రీపాద స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం





**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామం నందు శనివారం శ్రీపాద పాఠశాల నందు స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామసుబ్రహ్మణ్యం జ్యోతిని ప్రజ్వలన ప్రారంభించి మార్చ్ ఫాస్ట్, పిల్లలకు ఆటల పోటీలలో కోకో, కబడ్డీ మొదలైన ఆటలు నిర్వహించడమే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఆటల వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈనాటి కాలంలో విద్యార్థులు సెల్ ఫోన్‌లకు వాటిలో ఉండే ఆటలకు బానిసలు అవుతున్నారు. వాటి నుండి ఫిజికల్ గేమ్స్ వైపు మళ్ళించే విధంగా విద్యార్థులను మంచి దిశగా విద్యార్థులకు చదువుతోపాటు ఆటల వల్ల కలిగే మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలియజేశారు. అలాగే 2025వ సంవత్సరం కొత్త ఒరవడితో అనేక కొత్త యాక్టివిటీస్‌తో, వెనుకబడిన విద్యార్థులకు జీరో పీరియడ్, స్టడీ అవర్స్ నిర్వహించడంతోపాటు పదవ తరగతి విద్యార్థులను నిరంతర సాధనలో అసాధ్యాలను సుసాధ్యం చేసిన ఏకైక విద్యాసంస్థ మన శ్రీపాద అని తెలియజేశారు. అదేవిధంగా మీ బిడ్డల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తూ ఉంటామని స్కూల్ కరస్పాండెంట్ రామసుబ్రహ్మణ్యం పిల్లల తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామసుబ్రహ్మణ్యం, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకునికి ఎమ్మెల్యే నివాళి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్‌నాయకుడు మన్నెం వెంగన్న అకస్మిక మృతిని తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం టీడీపీ నాయకులతో కలిసి గ్రామానికి చేరుకుని మృతదేహన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వెంగన్న హఠాన్మరణం పార్టీకి తీరనిలోటన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ధైర్యంగా ఉండాలని పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, ఓబులరెడ్డి, తుమ్మల కిరణబాబు, నల్లిపోగు నరసింహా తదితరులున్నారు.

# మృతుల కుటుంబాలకు కంచి ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఇటీవల మృతిచెందిన నలుగురి కుటుంబాల వారికి శనివారం నిత్యాన్నదాత, శ్రీసాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచిపరమేశ్వరరెడ్డి 10వేల రూపాయలవంతున 40వేలరూపాయలను అందజేశారు. ఆయన ఆయాకుటుంబాలవద్దకు వెళ్ళి పరామర్శించి తమ వంతుగా 10వేల రూపాయలవంతున ఆర్థికసాయ మందించారు. రెండేళ్ళ క్రితం ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఔట్‌పేషెంట్లు, వారి సహాయకులు, ఇన్‌పేషెంట్ల సహాయకులు దాదాపు ఆరేడువందలమందికి ప్రతినిత్యం ఉచితంగా అత్యంత రుచికరమైన భోజనాన్ని సమకూరుస్తున్న పరమేశ్వరరెడ్డి ఈ కార్యక్రమాన్ని ఆజన్మాంతం నిర్విరామంగా కొనసాగిస్తామని ప్రకటించి అందుకుగాను హాస్పిటల్ ప్రాంగణంలో దాదాపు 65లక్షల రూపాయలతో భవనం కూడా స్వంతనిధులతో నిర్మించారు. దాంతోపాటు ఆయన సామాజికసేవాకార్యక్రమాలు తమ స్వంత గడ్డపై అందించాలని ఆత్మకూరు మున్సిపల్‌పరిధిలో ఎవరు మృతిచెందినా ఆ కుటుంబానికి 10వేలరూపాయలవంతున స్వంత నిధులు అందించేలా ఏడాదిన్నరక్రితం ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఆయన స్వంత నిధులతోనే ఒక కైలాసరథయాత్రావాహనాన్ని, నాలుగు శవశీతలపేటికలను కూడా సమకూర్చారు. నిత్యం జనాలు ఇబ్బందిపడుతున్న దృష్ట్యా ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండువద్ద, నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై నెల్లూరుపాళెం కూడలి వద్ద తాగునీటిసరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాంతోపాటు ఆత్మకూరు పరిధిలో గిరిజనులు వివాహం చేసుకునే సమయంలో దంపతులకు నూతన దుస్తులు, వధువుకు 10వేల రూపాయలనగదు అందించేలా గిరిజనవివాహకానుక అనే కార్యక్రమాన్ని కూడా ఇటీవల ప్రారంభించారు. శనివారం ఇటీవల మృతిచెందిన 2వవార్డు పరిధిలోని కుందేలు చెంచమ్మ కుటుంబాన్ని,



10వవార్డుపరిధిలో మహబూబ్‌జానీ కుటుంబాన్ని, 14వవార్డు పరిధిలోని మాముడూరు మస్తానయ్యకుటుంబాన్ని, 19వవార్డుపరిధిలోని మంగుదొడ్డి ఆదినారాయణకుటుంబాన్ని, కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించి ఆ కుటుంబాలకు 10వేల రూపాయల వంతున ఆర్థికసాయాన్ని అందజేశారు. కంచిపరమేశ్వరరెడ్డి అందిస్తున్న సామాజికసేవలు అమోఘం, అత్యంత ప్రయోజనకరం, అభినందనీయం అని సర్వత్రా కొనియాడుతున్నారు. ఆర్థికసాయమందుకున్న మృతుల కుటుంబాలవారు పరమేశ్వరెడ్డి సేవానిరతిని కొనియాడి ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టస్ట్ ప్రతినిధులు అచ్చోలు నరశింహారెడ్డి, మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ భూసేకరణలు నిలిపివేయాలి

### ప్రజా వినియోగానికి ఆటంకం విచారకరం : జిల్లా రైతుసంఘ నేత లక్కు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో పలు గ్రామాల్లో భూశేఖరణ నిలిపివేయాలని, అనాదిగా ఉన్న ప్రజా వినియోగానికి ఆటంకం కలిగించరాదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి లక్కు కృష్ణ ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా కొండలు, మేత పోరంబోకు భూములు తదితర ప్రజా సామూహిక అవసరాల కోసం రిజర్వు చేసిన ప్రభుత్వ భూములను నెల్లూరు జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అన్ని మండలాల తహసీల్దార్ల ఆదేశాల మేరకు గ్రామ పంచాయితీ తీర్మానాల ద్వారా ఏ డబ్ల్యూ భూములుగా మార్చేందుకు లేఖలను పంచాయతీ అధికారులకు గ్రామ పరిపాలనా అధికారులకు పంపారని ఆయన తెలిపారు. ఏఎస్ పేట మండలం శ్రీ కొలను గ్రామ సర్వే నంబర్ 411లో 32 ఎకరాలు పశువుల మేత పోరంబోకు భూమిని ఏడబ్ల్యూ భూమిగా మార్చమని ప్రతిపాదనలు పంపే నిమిత్తం పంచాయితీ తీర్మానం పంపాలని తేదీ గత నెల 14న ఉత్తర్వులు ఇచ్చారని, శ్రీకొలను గ్రామంలోని రైతాంగం గ్రామీణ స్థాయిలో పశువుల పెంపకమే జీవనాధారంగా ఉన్న రైతులు ప్రతి కుటుంబానికి పాడి కొరకు ఎన్నో కొన్ని పశువుల పెంపకం అలవాటుగా ఉన్న ప్రాంతాలలో మన పూర్వీకులు మేత పోరంబోకు స్థలాలను గ్రామ అవసరాల కోసం ఇచ్చారని అటువంటి భూములను ప్రధానమంత్రి కుసుమ సోలార్ పవర్ ప్రాజెక్ట్ కొరకు సేకరించడం అన్యాయమని ఈ విషయంపై నిరసన కార్యక్రమాలు చేపట్టారన్నారు. 2025వ సంవత్సరం నవంబరు నెల మర్రిపాడు మండలం కదిరినేని పల్లె గ్రామ ప్రజలకు తెలియకుండానే రిలయన్స్ ఇండస్ట్రీస్ వారికి ఈ గ్రామంలో 400 ఎకరాల భూమిని వయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం కొరకు కేటాయించినట్లు పత్రికలలో తెలుసుకున్న గ్రామస్తులు తీవ్రంగా స్పందించారన్నారు. ఉదయగిరి మండలం బండగాని పల్లె గ్రామంలో తేది అక్టోబర్ 3న నవంబర్ 11 ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని గ్రామంలోని ఇంటి గోడల మీద ఇంగ్లీషులో ముద్రించిన నోటీసు కాపీని అతికించారన్నారు. ఆ గ్రామంలో ప్రజా సంఘ నాయకుడు కాకు వెంకటయ్యను ముందస్తుగా పోలీస్ స్టేషన్‌ను పిలిపించి ప్రజాభిప్రాయ సేకరణలో ఎటువంటి అల్లర్లు చేపట్టకూడదని వార్నింగ్ ఇచ్చి పంపారన్నారు. బండగానెపల్లె గ్రామంలో విలువైన క్వార్ట్జ్ నిలువలు ఉన్న కొండను ఇండోసోల్ కంపెనీ వారికి ఒక సంవత్సరానికి 99,900 టన్నులు రాయిని తరలించుకునేందుకు అనుమతులు ఇచ్చారని, ఈ క్వాడ్జ్ రాయి బహిరంగ మార్కెట్‌లో 10వేల రూపాయలకు పైగా ఉన్నట్లు సమాచారం అయితే ఇండో సోల్ కంపెనీ వారికి ఒక టన్ను 125 రూపాయలకు ఒక సంవత్సరానికి లక్ష టన్నుల రాయిని తరలించేందుకు అనుమతులు ఇచ్చారని ప్రసాద్ తెలిపారు. బహిరంగ మార్కెట్లో ధరకు ప్రభుత్వం ఇచ్చిన ధరకు వ్యత్యాసాన్ని గమనించండని, లక్ష టన్నులకు 10వేల రూపాయలు తేడా ఉంటుందని నిపుణుల అభిప్రాయం అని పేర్కొన్నారు. లక్షల కోట్ల రూపాయల దోపిడీకి తెర లేచిందని స్థానికులు ఆరోపిస్తున్నారన్నారు. ఈ మూడు గ్రామాలలో పరిస్థితులను గమనిస్తే నెల్లూరు జిల్లాలో గతంలో వేల ఎకరాలను సేకరించిన ప్రభుత్వం వాటిని కార్పోరేట్ శక్తులకు అప్పగించి వాటిని బ్యాంకులలో తనకా పెట్టి వేలకోట్ల రూపాయలు లాభం పొంది ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడకుండా ఉన్నాయి. అవి అలా ఉంటే ఇప్పుడు గ్రామీణ స్థాయిలో సాధారణ ప్రజానీకానికి రైతాంగానికి అనేక అవసరాలకు ఉపయోగపడుతున్న కొండ మేత వాగు పోరంబోకు స్థలాలను నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ రిలయన్స్ ఇండోసోల్ కంపెనీలకు ప్రజలకు తెలియకుండానే అప్పగించడం అన్యాయమని, సంపద సృష్టించడం అంటే ఉత్పాదనలో ప్రజలను భాగస్వాములను చేసి సంపదను పెంచడం ఆమోదయోగ్యమని, ఆస్తులను విక్రయించి సంపదను సృష్టిస్తున్నామని చెప్పడం సిగ్గుచేటుగా ఉందని ఆయన పేర్కొన్నారు.



ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గ్రామీణ స్థాయిలో రైతాంగానికి ఉపయోగపడుతున్న ఈ భూములను ఏ పరిస్థితులలో అప్పగించకూడదని అలా అప్పగించడం దుర్మార్గమని ఈ ఉత్తర్వులను కలెక్టర్ వెంటనే వెనక్కు తీసుకోవాలని గ్రామీణ భూ సేకరణ కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నెల్లూరు జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి లక్కు కృష్ణ ప్రసాద్ డిమాండ్ చేశారు.

# లోక్ అదాలత్‌కు రాష్ట్ర స్థాయిలో నెల్లూరు ప్రథమ స్థానం

● లోక్ అదాలత్ ద్వారా 58616 కేసులు పరిష్కారం ● జిల్లా ఎస్పీకి ప్రత్యేక అభినందనలు తెలిపిన జిల్లా జడ్జి శ్రీనివాస్






**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రస్థాయిలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ప్రథమ స్థానం నిలిచింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం కేసులను పరిష్కరించారు. నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నేషనల్ లోక్ అదాలత్ జరిగింది. విభిన్న వివాదాలను న్యాయమూర్తులు ఇరువర్గాల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించారు. ఇందుకుగాను నెల్లూరుకు సంబంధించి 12 బెంచీలు గూడూరుకు సంబంధించి రెండు కావలికి సంబంధించి మూడు ఆత్మకూర్‌కు సంబంధించి రెండు వెంకటగిరి సూళ్లూరుపేట కోటకు నాయుడుపేట ఉదయగిరిలలో ఒక్కో బెంచ్ చొప్పున మొత్తం 26 బెంచ్‌లను ఏర్పాటు చేశారు తొలుత జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి నేతృత్వంలో న్యాయమూర్తుల న్యాయవాదుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు కమిషనర్ వైవో నందన్ న్యాయ వాద సంఘం అధ్యక్షుడు పి.అయ్యప్పరెడ్డి బార్ కౌన్సిల్ ఆఫ్ మెంబెర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఇన్సూరెన్స్ కంపెనీ బిఎస్ఎన్ఎల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని విరివిగా వారి వారి కేసులను పరిష్కారం చేసుకున్నారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి సివిల్ కేసెస్ 147 క్రిమినల్ కేసెస్ 32,657 ఫ్రీ లిటిగేషన్ కేసెస్ మున్సిపల్ ఆఫీస్‌కు సంబంధించి 15,513 మొత్తం 58616 కేసులు పరిష్కారం చేశారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడంతో నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ.శ్రీనివాస్ సహచర న్యాయమూర్తులకు న్యాయవాదులకు కోర్టు సిబ్బందికి కక్ష దారులకు జిల్లా పోలీసు యంత్రాంగానికి రెవెన్యూ యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసులను సైతం న్యాయమూర్తులు ఇరువు వర్గాలను ఒప్పించి పరిష్కరించారు. లోక్ అదాలత్ ద్వారా యాక్సిడెంట్ కేసులో నష్టపరిహారం కోటి రూపాయలు మంజూరైన బ్యాంకు చెక్కును కేసులోని లబ్ధిదారులకు జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ ఈ సందర్భంగా అందజేశారు. అలాగే మనస్పర్ధలతో విడాకులు వరకు వచ్చిన ఒక జంటను జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ తన మంచి మాటలతో ఇద్దరినీ ఒకటి చేసి పూలమాలలు మార్పించటం విశేషం.మొత్తం మీద లోక్ అదాలత్ విజయవంతంగా జరిగింది.

# కార్పొరేషన్‌కు రూ.5.13 కోట్లు వసూళ్లు : కమిషనర్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా జడ్జిల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు వరకు జరిగింది. ఇందులో లోక్ అదాలత్ నోటీసులు అందుకున్న బకాయి దారులు 500 మంది హాజరయ్యారు. నోటీసులు అందుకున్న వారు లోక్ అదాలత్ ద్వారా చెల్లించిన మొత్తము ఇంటి పన్ను 27లక్షలు, కొళాయి పన్ను 32.59 లక్షలు, ఖాళీ స్థలం పన్ను 1.00లక్ష, ట్రేడ్ లైసెన్సులు 4.50లక్షలు చెల్లించారు. అలాగే గడిచిన మూడు రోజులలో లోక్ అదాలత్ ద్వారా నోటీసులు అందుకున్న బకాయిదారుల నుంచి 4.50 కోట్లు నగర పాలక సంస్థ ఖజానాకు జమ అయినదని, మొత్తం కలిపి 5.13 కోట్లు వసూళ్లు జరిగాయని కమిషనర్ వైఓ నందన్ తెలియజేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా నోటీసులు అందుకొని ఇంకను బకాయిలు చెల్లించని వారిపై కోర్టు ద్వారా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లలో విశేషంగా కృషి చేసిన ఇంజనీరింగ్ విభాగం ఈఈ శేషగిరిరావును ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

# ఆత్మకూరులో లోక్‌అదాలత్‌లో 2195కేసులు పరిష్కారం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 2195కేసులు పరిష్కారం కాగా 43లక్షలా 69వేలా744రూపాయల నగదు వసూలైంది. సీనియర్ సివిల్‌జడ్జి, న్యాయసేవాఅధికారసంఘం చైర్‌పర్సన్ బి.గాయత్రి అధ్యక్షతన లోక్‌అదాలత్ నిర్వహించారు. కక్షిదారులను విచారించిన న్యాయమూర్తి రాజీ మార్గంలో కేసులను పరిష్కరించారు. సివిల్‌కేసులు17, క్రిమినల్‌కేసులు 2141, బ్యాంక్‌ల కేసులు 25, బిఎస్ఎన్ఎల్ కేసులు 12 ఈ లోక్‌అదాలత్‌లో న్యాయమూర్తి పరిష్కరించారు. ఈసందర్భంగా సీనియర్‌సివిల్‌జడ్జి గాయత్రి ప్రసంగిస్తూ కేసులు పరిష్కారానికి లోక్‌అదాలత్ మంచి వేదిక అని, కక్షిదారులు తమ కేసులను లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకుంటే వ్యవప్రయాసలు తగ్గిపోతాయన్నారు. ఈ అవకాశాన్ని ఇరువర్గాల కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి ఎల్.జగదీష్, లోక్‌అదాలత్‌మెంబర్ ఐ.మాల్యాద్రి, న్యాయవాది షేక్ రహమతున్నీసా బేగమ్, కోర్టు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## వైసీపీ మహిళా విభాగంలో..

# దువ్వూరు హారిక రెడ్డికి చోటు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగంలో పోలం రాజు గుంట గ్రామపంచాయతీ సర్పంచ్ దువ్వూరు హారిక రెడ్డికి పార్టీ కేంద్ర కార్యాలయం చోటు కల్పించింది. రాష్ట్ర మాజీమంత్రి కాకాణిగోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కార్యదర్శిగా నియామకం కావడం జరిగింది. సర్పంచ్‌గా గ్రామానికి సేవ చేస్తూ పార్టీ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా చురుకుగా పాల్గొంటూ పార్టీకి సేవ చేస్తున్న తరుణంలో పార్టీ అధిష్టానం మహిళా విభాగంలో కీలకమైన బాధ్యతను అప్పగించింది. ఈ మేరకు జిల్లాస్థాయిలో వైకాపా మహిళా విభాగం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె శనివారం **మేజర్‌న్యూస్‌**తో మాట్లాడారు. మహిళల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేస్తూ అండగా ఉంటామని అన్నారు. పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా చేస్తామని జిల్లా కార్యదర్శి పేర్కొన్నారు.

# కావలిలో మెగా లోకదాలత్ కార్యక్రమం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో శనివారం కావలి మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మెగా లోక్ అధాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులు కుటుంబ వివాదాల కేసులు, బ్యాంకు బకాయ కేసులు, సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.అలాగే అదాలత్, మీడియేషన్ ద్వారా చేసుకుంటే ఖర్చు, సమయం ఆదా అవుతుందని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఈ లోకదాల ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని తెలిపారు. అలాగే లోకదాతలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఈ సుధాకర్, అడిషనల్ జ్యుడీషియల్ ఫ్లస్ మెజిస్ట్రేట్ జి.విక్రశీ సిన్హా కలిసి సుమారు 523 సివిల్ క్రిమినల్స్ చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించి, అలాగే సుమారు 78,04,911/- నగదును కూడా పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కే.చక్రపాణి ఏపీపీ మృదుల, మెంబర్ ఐ.సాయిప్రసాద్ పి.సునీల్ కుమార్ సింగ్, జయలక్ష్మి, సభ్యులు, న్యాయవాదులు ఎస్.కెనడి, జగన్మోహన్రావు,ఏ. ప్రసాద్ రెడ్డి, కే.శ్రీనివాసులు రెడ్డి, రాజేంద్రప్రసాద్, బాబురావు, పి.వి.రమణారెడ్డి, బాలాజీ, ప్రసన్నకుమార్, శ్రీదేవి, జూనియర్ న్యాయవాదులు, పోలీసులు, వివిధ బ్యాంకుల వారు, మున్సిపాలిటీ వారు, లోకదాల మెంబర్ మాల కొండారెడ్డి, కోర్టు సిబ్బంది కక్ష దారులు పాల్గొన్నారు.

# చంద్రబాబును కలిసిన టీడీపీ నేత చౌదరి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకరపెంచలచౌదరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. మండల టిడిపి అధ్యక్షులకు విజయవాడలో రెండురోజులపాటు శిక్షణా తరగతులను నిర్వహించగా చౌదరి ఈతరగతుల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. పార్టీని బలోపేతం చేయాలని, పటిష్టపరచాలని, అందుకు నాయకులు చురుగ్గా వ్యవహరించాలని చంద్రబాబునాయుడు చౌదరికి సూచించారు. శిక్షణాతరగతుల సారాంశానుసారం వ్యవహరించాలని ఆయన సూచించారు. ఆత్మకూరు మండలంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాదించాల్సిన పరిస్థితి గురించి చంద్రబాబునాయుడు పెంచలచౌదరితో చర్చించారు.